

## వినాయక చవితి శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటనకర్తలు, చందాదారులకు వినాయకచవితి శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు.

–యాజమాన్యం


# తొలి వెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | సోమవారం 14 సెప్టెంబర్ 2026


## నత్తనడకన ఫ్లైఓవర్ పనులు.. సీపీఎం నిరసన



**రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే!**

**చుట్టూ 5 కిలోమీటర్లు తిరగాల్సిన పరిస్థితి**

**ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలి**

**ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు: గోశిక కరుణాకర్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** హైవే విస్తరణలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ మీదుగా చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంbvటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ మాట్లాడుతూ.. హైవే విస్తరణ పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదన్నారు. దీంతో చౌటుప్పల్ ప్రజలతో పాటు వివిధ మండలాల నుంచి రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**రోడ్డు దాటాలంటే ప్రమాదమే..**

ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా రహదారి దాటే సమయంలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని కరుణాకర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారి అవతలి వైపు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. పాత చౌటుప్పల్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, కళాశాల, వారాంతపు సంతకు వెళ్లాలన్నా వలిగొండ రోడ్డు లేదా లక్కారం మీదుగా సుమారు ఐదు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల సమయం, ఇంధనం వృథా కావడంతో పాటు అత్యవసర సమయాల్లో ప్రజలకు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

**ఓపెన్ ఫ్లైఓవర్‌ను త్వరగా అందుబాటులోకి తేవాలి**

స్థానిక ఎమ్మెల్యే, ఉమ్మడి జిల్లా మంత్రి స్పందించి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయించాలని కరుణాకర్ కోరారు. ముఖ్యంగా తంగెడపల్లి వద్ద, బస్టాండ్ ఎదురుగా నిర్మిస్తున్న ఓపెన్ ఫ్లైఓవర్‌ను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణ పనుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, బందారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, కందగట్ల ఆనంద్, ఉస్కాకుల శ్రీను, పర్ని ధర్మారెడ్డి, ఎండీ రేష్మ, చిగురు ఈదయ, మోగుదాల రాములు, చంద్రయ్య, బొడ్డు రాజు, భావనలపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి**

**ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం**



**తొలివెలుగు, నకిరేకల్:** విఘ్నాలను తొలగించే శ్రీ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో నియోజకవర్గంలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. "

వినాయకుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం నెలకొనాలని కోరుకున్నారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వేముల వీరేశం ఆకాంక్షించారు. గణనాథుడి కరుణాకటాక్షాలతో ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## యాదగిరిగుట్ట నారసింహుని సేవలో ఎమ్మెల్యే గండ్ర



**స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, ప్రత్యేక పూజలు**

**వేదాశీర్వచనం అందించిన ఆలయ అర్చకులు**

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అర్చకులు పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయానికి చేరుకున్న ఆయన స్వామి, అమ్మవార్లకు స్వర్ణ పుష్పార్చన, తులసి పుష్పార్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాందూరు వెంకటాచార్యులు, సురేంద్రచార్యులు, మంగళగిరి నరసింహమూర్తి, మాధవాచార్యులు, శ్రీనాథ ఆచార్యులు మరియు ఆలయ అధికారులు సురేందర్ రెడ్డి, వాసం వెంకటేష్, మాటూరి నాగరాజు పాల్గొన్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
సోమవారం 14 సెప్టెంబర్ 2026

# సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అధికార ప్రతినిధిగా మేడి రవిచంద్ర

**రామన్నపేట నాయకుడికి టీపీసీసీలో మరో కీలక బాధ్యత**

**ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత**

**నియామకంపై అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపిన రవిచంద్ర**



**తొలివెలుగు, రామన్నపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అధికార ప్రతినిధిగా రామన్నపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మేడి రవిచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మీడియా పబ్లిసిటీ చైర్మన్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీ విధానాలను ప్రజలకు వివరించే బాధ్యతను రవిచంద్ర నిర్వర్తించనున్నారు. అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేలా పత్రికా సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ అధిష్ఠానం సూచించింది. మేడి రవిచంద్ర 2001లో ఎన్ఎస్‌యూఐ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం 2009లో యువజన కాంగ్రెస్ సభ్యుడిగా పనిచేశారు. 2014లో నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2019లో టీపీసీసీ కన్వీనర్‌గా సేవలందించారు. 2023లో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్ అధికార ప్రతినిధిగా, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా రవిచంద్ర బాధ్యతలు చేపట్టారు. 2025లో వరంగల్ జిల్లా డీసీసీ అబ్జర్వర్‌గా, సత్తుపల్లి టీఓటీగా పనిచేశారు. పార్టీ అప్పగించిన వివిధ బాధ్యతలను నిర్వర్తించిన అనుభవంతో తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జ్ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి రాజన్న సిరిసిల్ల జిల్లా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి మేడి రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు సమర్థవంతంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

# దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదు

**బీఆర్ఎస్ వైఖరిపై ప్రభుత్వ విప్ వేముల వీరేశం ధ్వజం**

**హైదరాబాద్‌లో దళిత సంఘాల ధర్నాకు సంఘీభావం**

**దళిత సమాజానికి బీఆర్ఎస్ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలి**



**తొలివెలుగు, రామన్నపేట :** దళిత సమాజాన్ని అవమానించేలా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సంఘీభావం తెలిపారు. ధర్నాలో పాల్గొని దళిత సంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. శాసన సభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశారన్న ఘటన తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు దళితుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. దళిత సమాజాన్ని అవమానించే చర్యలను తెలంగాణ సమాజం ఎన్నటికీ సహించదని వేముల వీరేశం స్పష్టం చేశారు. దళితుల మనోభావాలను దెబ్బతీసేలా జరిగిన ఘటనలపై బీఆర్ఎస్ నాయకులు వెంటనే స్పందించి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**సామాజిక న్యాయం కోసం కృషి చేయాలి**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వేముల వీరేశం పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నించాలని సూచించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వాటర్‌మెన్ కుటుంబానికి మాజీ ప్రజాప్రతినిధుల అండ

**అనారోగ్యంతో మృతి చెందిన వాటర్‌మెన్ కుటుంబానికి పరామర్శ**

**ప్రగాఢ సానుభూతి తెలిపిన మాజీ ప్రజాప్రతినిధులు**

**తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయం**

**తొలివెలుగు, రాజపేట:** రాజపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వాటర్‌మెన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతుడి కుటుంబానికి తాము అండగా ఉంటామని, అవసరమైన సమయంలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయంగా రూ.10 వేల నగదును అందజేశారు. గ్రామపం చాయతీ వాటర్‌మెన్‌గా మృతుడు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి కుటుంబానికే కాకుండా గ్రామానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో బూరుగు రమేష్ గౌడ్, బాల్ద చంద్రయ్య, పాండవుల లక్ష్మణ్ గౌడ్, బూత్కూరి నరసింహారెడ్డి, ఎర్రగుంట సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం

**ఖైతపురంలో 'జై భీమ్ యూత్' ఆధ్వర్యంలో నిరసన**

**వివాదాస్పద వ్యాఖ్యలపై ఆగ్రహం**

**హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: తగరం సుభాష్ చంద్రబోస్**



**తొలివెలుగు, చౌటుప్పల్ :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఖైతపురం గ్రామంలో 'జై భీమ్ యూత్' ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తగరం సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. కోట్లాది మంది బహుజనులు గౌరవించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానకరంగా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. అంబేద్కర్ పట్ల చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు బహుజనుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను, అంబేద్కర్ ఆశయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యాఖ్యలకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మహనీయులపై అవమానకర వ్యాఖ్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. బహుజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనలు కొనసాగిస్తామని జై భీమ్ యూత్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ 2వ వార్డు సభ్యుడు తగరం నాగరాజు, గోపి మహేష్ గౌడ్, మాజీ సర్పంచ్ గుద్దేటి యాదయ్య, తగరం వెంకటేష్, తగరం జగన్, తగరం నరహరి, కోలుకులపల్లి స్వామి, గుద్దేటి రమేష్, సతీష్, తగరం నర్సింహా, శివాజీ, బాలు, భరత్, గుద్దేటి యాదగిరి, మధు, చింటూ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మృతి

**హైదరాబాద్ :** హైదరాబాద్ జలమండలిలో తీవ్ర పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్లనే వరుస మరణాలు సంభవిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆరోపించింది. కేవలం 24 గంటల వ్యవధిలో నేరేడ్‌మెట్–మౌలాలి ప్రాంతానికి చెందిన శ్రీహరి, పెద్దాపూర్‌కు చెందిన వినయ్, కుత్బుల్లాపూర్‌కు చెందిన కిరణ్ గుండెపోటుతో మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేసింది. విధి నిర్వహణలో మృతి చెందిన ముగ్గురు ఉద్యోగుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని జేఏసీ కోరింది. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల వరుస మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మీటర్ రీడర్లు, ఇతర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఉన్న పని ఒత్తిడిని తగ్గించి, పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని నేతలు కోరారు. ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని, కమిషన్ ఆధారిత కొత్త టెండర్ విధానాలను రద్దు చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది.

# సహకారంలో నామినేటెడ్ వద్దు..
# ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలే ముద్దు

సహకార సంఘాల్లో ప్రభుత్వ జోక్యం తగదు

తక్షణమే ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి: పీఏసీఎస్ ఛైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి

రైతాంగానికి రూ.1.50 కోట్ల దీర్ఘకాలిక రుణాల మంజూరుకు పాలకవర్గం ఆమోదం



తొలివెలుగు, చౌటుప్పల్ : సహకార వ్యవస్థల స్వీయ ప్రతిపత్తిని కాపాడాలని, సహకార సంఘాలకు తక్షణమే ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని చౌటుప్పల్ పీఏసీఎస్ ఛైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఆదివారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార చట్టాల స్ఫూర్తికి అనుగుణంగా సంఘాలు స్వతంత్రంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 1964 చట్టం ప్రకారం సహకార సంఘాలు తమ సొంత నిధులతో, స్వయం ప్రతిపత్తితో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి సంఘాల్లో ప్రభుత్వ జోక్యం పెరగడం సమంజసం కాదన్నారు. ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ విధానాన్ని తీసుకురావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు నిర్వహించే వరకు ప్రస్తుతం కొనసాగుతున్న పాలకవర్గాన్నే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చౌటుప్పల్ మండలంలో దీర్ఘకాలిక రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు రూ.1.50 కోట్ల రుణాలు మంజూరు చేయడానికి పాలకవర్గం ఆమోదం తెలిపింది. మార్టేజ్ రుణాల కింద ఎకరాకు రూ.3 లక్షల చొప్పున గరిష్టంగా రూ.15 లక్షల వరకు రుణాలు అందించనున్నట్లు తెలిపారు. జైకేసారంలో కలెక్టర్ కేటాయించిన 3.14 ఎకరాల స్థలంలో నూతన గోదాము నిర్మాణంతో పాటు కార్యాలయ భవన నిర్మాణానికి కూడా పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ నిర్మాణాలతో సహకార సంఘం కార్యకలాపాలు మరింత విస్తరించడంతో పాటు రైతులకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు జి. రూపమ్మ, డి. కృష్ణ, పి. వెంకటయ్య, డి. శ్రీశైలం, బి. సాయిలు, డి. శశిధర్‌రెడ్డి, పి. సూర, డి. బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన చరిత్ర
# భావితరాలకు తెలియాలి: బీజేపీ నేతలు

**హైదరాబాద్:** ఆపరేషన్ పోలోలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల త్యాగాలను స్మరిస్తూ.. ట్యాంక్‌బండ్‌లోని యుద్ధ ట్యాంక్ వద్ద తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో ఘన నివాళుల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సెప్టెంబర్ 13, 1948న సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆదేశాల మేరకు, మేజర్ జనరల్ జె.ఎన్. చౌధరి నాయకత్వంలో భారత సైన్యం ఆపరేషన్ పోలో చేపట్టిందని, నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత పోరాటాలు, సర్దార్ పటేల్ చొరవ ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పేర్కొన్నారు. ఈ విమోచన చరిత్రను రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు.

ఇది రాజకీయాలకు అతీతంగా భావితరాలకు అందించాల్సిన చారిత్రక బాధ్యత అని తెలిపారు. వీరభైరాన్‌పల్లి, అప్పంపల్లి వంటి ప్రాంతాల్లో అమరులైన వారి త్యాగాలు చిరస్థాయిగా నిలుస్తాయని విమోచన కమిటీ ఛైర్మన్ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. ఈ చరిత్రను భావితరాలకు చాటిచెప్పడమే తెలంగాణ విమోచన కమిటీ ప్రధాన లక్ష్యమని కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ పోలోలో సేవలందించిన రిటైర్డ్ ఆర్మీ జవాన్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సైనికులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.



## తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరికలు



**ఇంద్రవెల్లి:** ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ కమిటీ ఛైర్మన్ మెస్రం ఆనందరావుతో పాటు ఇంద్రవెల్లి మండల సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మెస్రం భీంరావు ఆదివారం తెలంగాణ రక్షణ సేనలో చేరారు. బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు ముత్నూర్ సర్పంచి విఠల్, ఆసోద సర్పంచి నగేశ్, మాజీ ఎంపీటీసీ మనోహర్, మెస్రం దయాకర్, తదితరులు పార్టీలో చేరారు.

## హక్కుల కోసం పోరాడాలి

ఇంద్రవెల్లి: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని హక్కుల సాధన కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ పిలుపునిచ్చారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో పాఠశాలల్లో పని చేస్తున్న కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు
## అండగా నిలుస్తోంది



**వెల్దండ:** సీఎంఆర్ఎఫ్ పేదలకు అండగా నిలుస్తోందని కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్క రాజశేఖర్ అన్నారు. వెల్దండ మండలం చెర్కూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి మౌనికకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 21 వేల చెక్కును ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎంతో మంది నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. వెల్దండ మండలం చెర్కూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దాసరి బాలయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. అతని భార్య పెంటమ్మకు రూ.20 వేలను ఆర్థిక సాయంగా అందించారు.

## హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో
## 1.33 మట్టి విగ్రహాల పంపిణీ

**హైదరాబాద్:** : గణేష్ ఉత్సవాల సందర్భంగా పర్యావరణహిత విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఉద్దేశంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ 1,33,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. సెప్టెంబర్ 13, 2026 నాటికి హెచ్ఎండీఏ మొత్తం 1,33,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. ఇందులో 8 అంగుళాల పరిమాణం గల 80,000 విగ్రహాలు,1 అడుగు పరిమాణం గల 53,000 విగ్రహాలు ఉన్నాయి. భక్తులు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గణేష్ ఉత్సవాలను బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించేందుకు ప్రోత్సహించడమే మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ప్రధాన ఉద్దేశం. ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పర్యావరణహిత విధానాలను పాటించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు హెచ్ఎండీఏ పలు కార్యక్రమాలను చేపడుతోంది.

# చిన్నపాటి వర్షానికే 'చౌటుప్పల్' జలమయం

**లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు.. ప్రజలకు తీవ్ర అవస్థలు**

**అరకొర డ్రైనేజీ, నాళాల నిర్వహణ లోపమే కారణమంటున్న పట్టణవాసులు**

**తంగడపల్లి, వలిగొండ రోడ్ల నాళాలపై ఆక్రమణలున్నాయంటూ ఆరోపణలు**

**సమగ్ర సర్వేతో శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి విజ్ఞప్తి**

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చిన్నపాటి వర్షానికే చౌటుప్పల్ పట్టణం జలమయమవుతున్న పరిస్థితి పట్టణవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. శనివారం రాత్రి కురిసిన వర్షంతో పలు లోతట్టు ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోగా, కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి సైతం నీరు చేరినట్లు స్థానికులు తెలిపారు. దీంతో రాత్రివేళ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్న నాళాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు. పట్టణం విస్తరిస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా మురుగునీటి, వర్షపు నీటి పారుదల వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

**నాళాల పరిస్థితిపై అనుమానాలు.. సమగ్ర సర్వేకు డిమాండ్:**

**తంగడపల్లి రోడ్డు.. నాగులకుంట అలుగు ప్రవాహంపై ఆందోళన**

తంగడపల్లి రోడ్డులోని నాగులకుంట అలుగు ప్రవాహానికి సంబంధించిన నాళా వద్ద వర్షపు నీటి ప్రవాహ మార్గం వెడల్పు తగ్గేలా చిన్నపాటి పైపులు ఏర్పాటు చేస్తున్నట్లు కొందరు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితిని స్పష్టం చేయాలని కోరుతున్నారు. ప్రవాహ మార్గం కుదించబడితే భవిష్యత్తులో భారీ వర్షాల సమయంలో నీటి పారుదలపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ అంశంపై అధికారికంగా పరిశీలన జరిగి వాస్తవాలు వెల్లడించాల్సి ఉంది.

**వలిగొండ రోడ్డులోనూ ఆక్రమణల ఆరోపణలు**

వలిగొండ రోడ్డులోని నాళా పరిధిలో ఆక్రమణలు ఉన్నాయనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అసలు నాళా వెడల్పు ఎంత? ప్రస్తుతం ఎంత మేరకు అందుబాటులో ఉంది? ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు లేదా ఆక్రమణలు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర సర్వే నిర్వహించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఆక్రమణలు ఉన్నట్లు అధికారికంగా నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రతి వర్షానికీ ఇదే పరిస్థితి ఎందుకు?**

పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం కురిసిన ప్రతిసారీ నీరు నిలిచిపోవడం, కొన్ని సందర్భాల్లో ఇళ్లలోకి చేరడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. వర్షపు నీటి సహజ ప్రవాహ మార్గాలను గుర్తించి, నాళాల్లో పూడికతీత చేపట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతులు, విస్తరణ పనులు చేపట్టాలని సూచిస్తున్నారు. పట్టణంలోని మొత్తం డ్రైనేజీ వ్యవస్థపై సాంకేతిక అధ్యయనం నిర్వహించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

**అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన ఏదీ?**

వర్షం అనంతరం సమస్యాత్మక ప్రాంతాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని అంచనా వేయాలని స్థానికులు కోరుతున్నారు. నీరు ఎందుకు నిలుస్తోంది? ఏ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం వస్తోంది? ఎక్కడ అడ్డంకులు ఉన్నాయి? అనే అంశాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను ముందుగానే గుర్తించి వర్షాకాలంలో ప్రత్యేక పర్యవేక్షణ చేపడితే ఇళ్లలోకి నీరు చేరే పరిస్థితిని కొంతవరకు నివారించవచ్చని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలి:**

చౌటుప్పల్ పట్టణంలోని డ్రైనేజీ, నాళాల సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు. మున్సిపల్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నాళాలపై వస్తున్న ఆక్రమణల ఆరోపణలు, వర్షపు నీటి పారుదల సమస్యలపై సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను గుర్తించాలని కోరుతున్నారు. అవసరమైన చోట్ల నాళాల పునరుద్ధరణ, విస్తరణ, పూడికతీత పనులు చేపట్టి భవిష్యత్తులో వర్షం వచ్చిన ప్రతిసారీ ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణవాసులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.





## సుఖసంతోషాలు నింపాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నా: టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించే వినాయక చవితి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకగా నిలుస్తుందని, గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు.



సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని, వినాయక మండపాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు. పండుగను కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం ద్వారా సోదరభావం, సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని టీపీసీసీ చీఫ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి, ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రభుత్వ తీరుపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఫైర్



**హైదరాబాద్: :** అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా, కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీల నాటకంలా సాగాయని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం బీజేపీ స్టేట్ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. ధరణి పోర్టల్ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్‌లో 23 లక్షల ఎకరాల ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు తేలినా, ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి భూములను ప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదని నిలదీశారు. కుత్బుల్లాపూర్‌లోని రూ.33 వేల కోట్ల విలువైన ఐడీపీఎల్ భూములను ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లకుండా ఎందుకు కాపాడటం లేదని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ పేరిట పేద అసైన్డ్ భూములను కారుచౌకగా కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చుతున్న ప్రభుత్వం, మూసీ నదిలో పెద్దల ఆక్రమణల జోలికి ఎందుకు వెళ్లడం లేదన్నారు. ప్రభుత్వంలోని మంత్రుల వ్యాపార ప్రయోజనాలు, క్విడ్–ప్రో–కో వ్యవహారాలపై తమ వద్ద 200లకు పైగా పక్కా ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ భూ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, లేకపోతే గవర్నర్‌ను, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆశ్రయించడంతో పాటు ఢిల్లీలో రాహుల్ గాంధీ నివాసం ముందే ధర్నా చేపడతామని స్పష్టం చేశారు.